

26 నుంచి యల్లారమ్మ జాతర

ప్రజాశక్తి-జామి

జామి యల్లారమ్మ జాతరకు ముహూర్తం ఖరారైంది. ఫిబ్రవరి 26, 27, 28 తేదీల్లో జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దల సమక్షంలో పండితులు ముహూర్తం పెట్టారు. 26న తొలేళ్ల ఉత్సవం, 27న తీర్థ మహోత్సవం, 28న చిన్న తీర్థం నిర్వహించేందుకు నిర్ణయించారు. ప్రతి ఏటా శివరాత్రి వెళ్లిన తొమ్మిది రోజుల తర్వాత యల్లారమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీ. జిల్లాలో అతిపెద్ద జాతరలో జామి యల్లారమ్మ జాతర ఒకటి. లక్షలాది మంది జనం జాతరకు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలోనే జాతర ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేయనుంది. కార్యక్రమంలో సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, ఆలయకమిటీ సభ్యులు, ఉప సర్పంచ్ అల్లు పద్మ, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

ధాన్యం కొంటారో.. లేదో?

ఆందోళనలో రైతులు

రైతులవద్దనున్న ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, గత వారం రోజులుగా రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు నిలిపేశారు. దీంతో తమ కళ్లాల్లో ఉన్న ధాన్యం కొంటారో, లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలు నిలిపేయడంతో కళ్లాల వద్ద 15, 20 రోజుల నుంచి బస్తాల్లోకి ఎత్తిన ధాన్యానికి రైతులు కాపలా కాస్తున్నారు.

కళ్లంలో ఉంచిన ధాన్యం బస్తాలు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలో 16,700 ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. సుమారు 32 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లుగా వ్యవసాయ అధికారులు తెలిపారు. వాటిలో 29 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మండలంలో కొనుగోలు చెయ్యాలని అధికారులు లక్ష్యంగా చేసుకున్నారు. ఆ మేరకు ఆయా రైతు భరోసా కేంద్రాలలో కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాట్లు చేశారు. ఇప్పటివరకు 21 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు ఇన్‌ఛార్జి సిఎస్ డిప్యూటీ తహశీల్దార్ సాయికృష్ణ చెబుతున్నారు. మిగిలిన ధాన్యం మాత్రం కళ్లాల వద్దే ఉన్నాయి. ఈ ధాన్యం కొంటారో, లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోళ్లపై ఇప్పటి వరకు స్పష్టత లేకపోవడంతో ఆరుగాలం సేద్యం చేసిన రైతుకు ప్రతి ఏడాది లాగే ఈసారీ ఆందోళన తప్పడం లేదు. పండించిన పంటను విక్రయించడం రైతుకు సవాలుగా మారింది. అమ్మిన ధాన్యానికి 5 కిలోలు ఎక్కువ తీసుకోవడం, ప్రభుత్వం గోనెసంచులు, రవాణా ఛార్జీలు ఇవ్వక పోవడం ఎన్నో కష్టాలకోర్చి సేద్యం చేసినా రైతుకు నష్టాలు తప్పడం లేదు. ఈఏడాది గోనె సంచులను ప్రభుత్వం సరఫరా చేయలేదు. రైతులు కొనుగోలు చేసిన గోనెసంచులు నాణ్యత లేకపోవడం, ఎక్కువ రోజులు ధాన్యం నిలువ ఉంచడంతో ఆ సంచులు చిరిగి పోయే దశలో ఉన్నాయి.

నేటి నుంచి ధాన్యం కొంటాం : జెసి

విజయనగరం : జిల్లా యంత్రాంగం అభ్యర్థన మేరకు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎమ్‌డి జిల్లాకు అదనపు లక్ష్యం కేటాయించారని, ఈనేపథ్యంలో ఆదివారం నుంచి ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ తెలిపారు. జిల్లాలో 2.64లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, పూర్తయ్యిందని, అయితే రైతుల వద్ద ఇంకా ధాన్యం ఉండిపోయాయని తెలిపారు. ఈనేపథ్యంలో వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా మొబైల్ యాప్ ద్వారా వివరాలు సేకరించగా ఇంకా లక్ష టన్నుల ధాన్యం ఉన్నట్లు నమోదైందని తెలిపారు. ఈనేపథ్యంలో వచ్చిన అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని

15 రోజులైంది

ధాన్యం నూర్పిడి చేసి 15 రోజులవుతోంది. 400 బస్తాలు కళ్లన్నే ఉన్నాయి. కొంటామని 10 రోజులుగా చెబుతున్నారు. కొంటారో, లేదో తెలియడంలేదు

– వి.కృష్ణారావు, రైతు, దిబ్బగుడ్డివలస

జియోట్యాగింగ్ చేశాం

మండలంలో ఇప్పటివరకు 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. జిల్లా లక్ష్యం పూర్తికావడంతో తాత్కాలికంగా కొనుగోలు నిలిపేశాం. మండలంలో ఇంకా 1512 మంది రైతుల వద్ద నుంచి మరో 7 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చెయ్యాల్సి ఉంది. వారందరికీ జియో ట్యాగింగ్ చేశాం. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే కొనుగోలు ప్రారంభిస్తాం.

– సాయికృష్ణ, సిఎస్ డిటి

అప్పులు ఎప్పటికి తీర్చాలి?

ధాన్యం కొనుగోలు నిలిపేయడంతో పండించేందుకు చేసిన పెట్టుబడి అప్పులు ఎప్పటికి తీర్చాలి? ఆందోళనగా ఉంది. వెంటనే అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలి.

– చింతల మహాలక్ష్మి, మహిళా రైతు, దిబ్బగుడ్డివలస

ధాన్యం వద్ద కాపలా ఉన్న మహిళా రైతు మహాలక్ష్మి

నిలిచిన బిల్లులు

కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగర పాలక సంస్థలో అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం లేచిన దగ్గర నుంచి ఏదో ఒక చోట నూతన కాలువ, రోడ్లు, కుళాయిలు ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేయిస్తున్న పాలకులు, అధికారులు ఆ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ ఆద్వర్యంలో ఇప్పటికే15వ ఆర్థిక సంఘం నిధులు ద్వారా 259 లక్షలతో 10 అభివృద్ధి పనులు పూర్తి చేశారు. మరోవైపు జనరల్ పంఢ్‌నుంచి రూ.9.11 కోట్లు పనులు పూర్తి చేశారు. వాటికి బిల్లులు కూడా కాంట్రాక్టర్లు పెట్టారు. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా నేటి వరకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.12 కోట్లు వరకు పెండింగ్‌లో ఉండిపోవడంతో కాంట్రాక్టర్లు ఉదయం, సాయంత్రం నగర పాలకసంస్థ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు నగర పాలకసంస్థ అకౌంటెంట్ విభాగం వారు మొత్తం బిల్లులు సిఎఫ్‌ఎంఎస్‌కు అప్‌లోడ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సిఎఫ్‌ఎంఎస్ ద్వారా డబ్బులు చెల్లించాల్సి ఉంది. దీంతో ప్రభుత్వం ఎప్పుడు డబ్బులు వేస్తుందా అని కాంట్రాక్టర్లు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. పనులు చేయించుకుంటున్న ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల వడ్డీలు కట్టేందుకు ఇబ్బంది పడాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత జూన్ నుంచి బిల్లులు పడకపోవడంతో కనీసం సంక్రాంతి పండగ నాటికైన బిల్లులు పడతాయని కాంట్రాక్టర్లు ఎదురు చూశారు. కానీ సంక్రాంతికి కూడా బిల్లులు కాలేదు సరికదా నేటికీ చెల్లించలేదని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న కాలంలో అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. మరోవైపు ఇప్పటకే కొంత మంది కాంట్రాక్టర్లు పనులు చేయకుండా ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో వేచి ఉన్న కాంట్రాక్టర్లు

వైసిపి కార్యాలయానికి శంకుస్థాపన

విజయనగరం టౌన్ : దాసన్నపేట కాళీకామాత గుడి సమీపంలో వైసిపి జిల్లా నూతన కార్యాలయం నిర్మాణానికి పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ శనివారం భూమి పూజ చేశారు. బొబ్బిలి, ఎస్.కోట, రాజాం ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, కంబాల జోగులు, మేయర్ వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏడాదిలోగా కార్యాలయం నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. పది రోజుల్లో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

నెలలోగా గ్రౌండింగ్ చేయాలి

- మిల్లెట్ ప్రోసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహం
- జిల్లా స్థాయి పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులను నెల రోజుల్లోగా గ్రౌండింగ్ జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ సూర్య కుమారి ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను గడువు లోగానే పరిష్కరించాలని అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఫుడ్ ఉద్యాన శాఖ, మత్స్యశాఖల ద్వారా పిఎంజిఎస్.వై కింద యువతకు అవకాశాలు కల్పించాలని సూచించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం అక్టోబర్ నుండి జనవరి వరకు 104 దరఖాస్తులు అందగా 82 దరఖాస్తులను ఆమోదించామని, కాలుష్య నియంత్రణ శాఖ వద్ద 19 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, 3 దరఖాస్తులు తిరష్కరించామనిపరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పాపారావు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను నేరుగా తిరష్కరించవద్దని, దరఖాస్తులోని లోపాలను సవరించి తిరిగి సమర్పించమని చెప్పి, అందుకు తగు సలహాలను అందించాలని సూచించారు.

మాల్స్ , దుకాణాల్లో భద్రతా తనిఖీలు

వినియోగదారులకు కనీస భద్రత ఉండేలా దుకాణాల్లో మాల్స్‌లో భద్రతా అంశాలను తనిఖీ చేసి ఆడిట్ నివేదిక నందించాలని ఆదేశించారు. అగ్నిమాపక, లేబర్, మున్సిపల్‌శాఖల వారు సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎంట్రీ, ఎగ్జిట్ ద్వారాలు వేర్వేరుగా ఉండాలని, ఫైర్ సామాగ్రి, అత్యవసర ద్వారాలు ఉండాలని, నిబంధనలను పాటించని వాటి లైసెన్స్ రద్దు చేయాలని అన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ కళ్యాణ చక్రవర్తి, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస రావు, జిల్లా అధికారులు, ఎపిఐఐసి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

16న రెడ్ క్రాస్ వార్షిక సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ వార్షిక సాధారణ సమావేశం ఈనెల 16న ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జరుగుతుందని రెడ్ క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షులు, కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. మేనేజింగ్ కమిటీ ఎన్నిక నిర్వహణతో పాటు ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తామని పేర్కొన్నారు. సంస్థ జీవిత కాల సభ్యులు, ప్యాట్రన్, వైస్ ప్యాట్రన్‌లు, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈ సమావేశానికి తమ గుర్తింపు కార్డులతో సహా హాజరు కావాలని కోరారు.

పతనమవుతున్న విలువలు

- పాశ్చాత్య పోకడల ప్రభావంతో కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

డబ్బు, పాశ్చాత్య పోకడల ప్రభావంతో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అయిపోయిందని, దాని ప్రభావంతో సమాజంలో విలువలు రోజురోజుకూ పతనమైపోతున్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ చక్రవర్తి ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల్లో నైతిక విలువలు కొరవడుతున్నాయని, దీనిపై తల్లిదండ్రులు ప్రత్యేక దష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. సమాజంలో చోటు చేసుకుంటున్న దుష్పరిణామాలు తగ్గాలంటే పటిష్టమైన కుటుంబ వ్యవస్థ ఏర్పడాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ సేవా సదన్ భవనంలో నల్సా మాడ్యుల్ మెగా న్యాయ అవగాహన శిబిరం జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బిహెచ్‌వి లక్ష్మీ కుమారి సభకు అధ్యక్షత వహించగా.. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ చక్రవర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల అక్రమ రవాణా, వాణిజ్య లైంగిక దోపడీ, వయోవృద్ధుల రక్షణ వారికి అందుతున్న న్యాయ సేవలపై ప్రసంగించారు.

డబ్బు సంపాదన, ఆస్తులు కూడబెట్టడమే ప్రధానంగా చాలా మంది జీవిస్తున్నారని, ఇది సమాజానికి మంచిది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలపై పర్యవేక్షణ లోపం ఉంటుందని, దీని వల్ల వారిలో నైతిక విలువలు కొరవడుతున్నాయన్నారు. దాని దుష్పరిణామాలు సమాజంపై ప్రభావం చూపుతున్నాయని అన్నారు. పిల్లల్ని పెంచే విధానం, చదువు చెప్పే విధానంలో మార్పు రావాలని హితవు పలికారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాజ హితమే లక్ష్యాంగా పిల్లల్ని తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. వయసుతో పాటు చోటు చేసుకొనే హార్మోన్ల ప్రభావం గురించి యుక్త వయసుకు వచ్చిన యువతీ, యువకులకు విడమరిచి చెప్పి, వారు దారితప్పకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సూచించారు. బాధితులకు చట్టాలు ఎప్పుడూ అండగా నిలుస్తాయని భరోసా ఇచ్చారు.

జిల్లా కోర్టు ఒకటో అదనపు న్యాయమూర్తి కె. రాధారత్నం మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుకోవాలని సూచించారు. మన చుట్టూ ఉండేవాళ్లలోనే మనకి శత్రువులు ఉంటున్నారని అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రేమ అనే ఉచ్చులో పడి పిల్లలు వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా కోర్టు నాలుగో అదనపు న్యాయమూర్తి షేక్ సికిందర్ భాషా మాట్లాడుతూ సమాజ స్థితిగతులను అర్థం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ జీవించాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జగదీష్ బాబు, సిడబ్ల్యుసి ఛైర్ పర్సన్ హిమబిందు మహిళలకు, వృద్ధులకు జరుగుతున్న అన్యాయాలు, న్యాయ సేవలపై మాట్లాడారు. వయో వృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందుతున్న పథకాలు, సేవలపై వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఎడి జగదీష్ వివరించారు.

ఈ సందర్భంగా న్యాయ సేవా సదన్ భవనంలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. డిఆర్‌డిఎ, మెప్మా, మహిళా సమాఖ్య సభ్యులు తయారు చేసిన వస్తువులు, చేనేత వస్త్రాలను ప్రదర్శనలో ఉంచారు. సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.హెచ్.వి. లక్ష్మీకుమారి, ఇతర న్యాయ ప్రముఖులు, న్యాయవాదులు, వయో వృద్ధులు, వివిధ సంస్థల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో, కబడ్డీ విజేత విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కంచెర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఖోఖో రాష్ట్ర పోటీలు, కబడ్డీ ఉత్తరాంధ్ర పోటీల్లో విజేతలుగా విజయనగరం జట్లు నిలిచాయి. ఖోఖో ఫైనల్లో ప్రకాశం జట్టుపై విజయనగరం విజయం సాధించింది. కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో విజయనగరం.. నెల్లిమర్ల జట్టుపై గెలుపొందింది. ఖోఖోలో మూడో స్థానంలో విశాఖపట్నం, నాలుగో స్థానంలో తూర్పు గోదావరి జట్లు నిలిచాయి. కబడ్డీ ో అలుగోలు, విశాఖ జట్లు మూడు, నాలుగు స్నానాల్లో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, కంచెర్ల ఫౌండేషన్ సభ్యులు కుమార్ అందజేశారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఖో ఖో అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ, రంగారావు దొర, చిన్నంనాయుడు మాస్టర్, బొమ్మనా రామారావు, పతివాడ శ్రీనివాసరావు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కబడ్డీ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న కౌశిక్

నెలాఖరికి ఫిష్ ఆంధ్రా యూనిట్లు

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెలాఖరుకు జిల్లాలో ఫిష్ ఆంధ్రా యూనిట్లను ప్రారంభించాలని, మత్స్యశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. మత్స్యశాఖ ద్వారా జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై, కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం సమావేశం నిర్వహించారు. డివిజన్ల వారీగా సంబంధిత మత్స్యశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఫిష్ ఆంధ్రా ఔట్ లెట్లను ప్రారంభించడంలో జరుగుతున్న జాప్యంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. లబ్ధిదారులను చైతన్యపరిచి, యూనిట్లను త్వరగా ప్రారంభించేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పటికే ఎంపికైన లబ్ధిదారులతో ఈ నెలాఖరుకల్లా ప్రారంభింపజేయాలని ఆదేశించారు. సొంత స్థలాల్లో యూనిట్లను స్థాపించడానికి ముందుకువచ్చే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీ స్థలాల్లో షాపులను పెట్టుకునేవారి దగ్గరనుంచి, నిబంధనల ప్రకారం ఆయా స్థానిక సంస్థల తీర్మానంతోపాటుగా, సమగ్ర వివరాలతో ఒప్పందాన్ని కూడా తీసుకోవాలని చెప్పారు.

యువతకు ఉపాధి కల్పించడంతోపాటు, ప్రజలకు నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను అందించడానికి, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, లక్ష్యాలను శతశాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో మత్స్యసంపద అభివద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మండల, జిల్లా స్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ, లక్ష్యాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నిర్మలాకుమారి, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, ఎల్‌డిఎం శ్రీనివాసరావు, డిసిసిబి సిఇఒ జనార్ధనరావు, మత్స్య అభివృద్ధి అధికారులు, సహాయాధికారులు, గ్రామ మత్స్య సహాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కోడి రామ్మూర్తి ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కోడి రామమూర్తి నాయుడు ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ముందుగా ఆయన విగ్రానికి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మేయర్ వెంపడాపు. విజయలక్ష్మి,డెప్యూటీ మేయర్లు ఈశారాపు రేవతిదేవి, కోలగట్ల శ్రావణి ,ఖో ఖో ,కబ్బడ్డీ అసోసియేషన్ లు నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథులుగా హాజరైన మేయర్, డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ విజయనగరం క్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన యోధుడు,బలశాలి కోడి రామమూర్తి నాయుడు అన్నారు, పుట్టింది వీరఘట్టం లో అయిన చదువు,విద్యాభ్యాసం విజయనగరం లో జరిగిందని తెలిపారు. ఆయన మహా బలశాలి ఆయనను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు వెళ్లాలన్నారు. కోడి రామమూర్తి నాయుడు పార్కు ,వ్యాయమ శాల అభివద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

అనంతరం కబ్బడ్డీలో ఇండియాకు ఆడిన, పోలీస్ టీమ్ కోచ్‌గా ఉన్న కోటేశ్వరరావు, రాంబాబు, వెయిట్ లిఫ్టంగ్ క్రీడాకారిణి ఉషా, పలువురు వ్యాయమ ఉపాద్యాయులు ను ముఖ్య అతిథులు చేతులు మీదుగా సత్కరించారు. అనంతరం కోడి రామమూర్తి నాయుడు చిత్రపటంతో గంటస్తంభం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కోడి రామమూర్తి నాయుడు, కమిటీ సభ్యులు, వివిధ క్రీడా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులను సన్మానిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, అసోసియేషన్ ప్రతినిధులు

విద్యాశాఖలో బయటపడ్డ డొల్లతనం

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

సాక్షాత్తు జిల్లా విద్యాశాఖ మంత్రి ఇలాకాలోనే ఆశాఖ పని తీరులో డొల్లతనం బయటపడం చర్చనీయాంశంగా మారింది. అనంతర పరిణామాలు కూడా తీగ లాగితే డొంక కదిలినట్టుగా కనిపిస్తున్నాయి. దీంతో, గడిచిన వారం రోజులుగా విద్యాశాఖ పనితీరు ముఖ్యంగా పనుల కేటాయింపుల్లో పర్యవేక్షణా లోపాలు, నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు వంటివి చోటు చేసుకున్నట్టుగా పబ్లిక్ టాక్. ఈనెల 20న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిల్లాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఉపాధ్యాయుల పనితీరులో లోపాలు మొదలుకుని, నిర్మాణ పనుల కేటాయింపులు, నాణ్యతా ప్రమాణాల్లో లోపాలు ఉన్నట్టుగా ఆయన బయటపెట్టారు. ఇందుకు కారణమైన వారిని మందలింపులు, హెచ్చరింపులు కూడా చేశారు. అంతటితో ఆగలేదు. ఆర్‌జెడి, డిఇఒ, ఎపిసి సహా ఓ ఉపాధ్యాయుడికి, పలువురు ఇంజినీర్లుకు ఛార్జి మెమోలు కూడా ఇచ్చారు. జిల్లా ఉన్నతాధికారిని కూడా సుతిమెత్తగా మందలించారని బాహాటంగానే చర్చసాగుతోంది. ఈ సంగతి కాస్త పక్కనబెడితే... విద్యకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్టుగా ప్రభుత్వం, అందులోనూ సిఎం జగన్మోహన్‌రెడ్డి పదేపదే చెప్తున్నారు. విద్యాశాఖ మంత్రి కూడా మన జిల్లాకు చెందినవారే. ఈ నేపథ్యంలో విద్య ప్రమాణాల తీరు తెన్నులు, నాడు – నేడు పేరిట రూ.వేల కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులు మిగిలిన జిల్లాలతో పోలిస్తే కాస్త మెరుగుగానే ఉంటాయని ఎవరైనా ఊహించడంలో తప్పులేదు. కానీ, మేడి పండు చూడు మేలిమై ఉండు – పొట్ట విప్పిచూడు పురుగులుండు అన్నట్టుగా ఉత్తీర్ణతలో మెరుగైన స్థానాలు సాధిస్తున్నట్టు ఏటా చంకలు గుద్దుకుంటున్న మన జిల్లాలో అధికారుల పర్యవేక్షణ, బోధనా ప్రమాణాలు మొదలుకుని అడ్మినిస్ట్రేషన్, ఇంజినీరింగ్ పనుల కేటాయింపు, అమలులో ఎన్నో లోపాలు ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలో వెలుగులోకి వచ్చాయి. దీన్ని గుణపాఠంగా తీసుకుని ముందుకు సాగాల్సిన

ఉన్నతాధికారులు నవ్విపోదురుగాక నాకేంటి అన్నట్టుగా వ్యవహరిస్తే వ్యవస్థ మరింత దిగజారిపోయే ప్రమాదం ఉంటుంది. సరిగ్గా అందుకు తగ్గట్టే ఛార్జి మెమోలు అందుకున్న అధికారులకే గణతంత్ర వేడుకల్లో ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందజేశారంటూ పలువురు చర్చించుకుంటున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ప్రవీణ్ ప్రకాష్ ఆదేశంతో మెమోలు పుచ్చుకున్న ఆర్‌జెడి జ్యోతికుమారి, డిఇఒ లింగేశ్వరరెడ్డి ఇప్పుడిప్పుడే పురివిప్పుతున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ తమ స్థాయిలోనూ మెమోల పరంపర కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు పది మందికి మెమోలు జారీ చేశారు. ఇద్దరిని సస్పెండ్ చేశారు. అక్కడితో ఆగకుండా నా వరకూ వచ్చినప్పుడు నేనెందుకు ఉపేక్షించాలంటూ జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాలలను తనిఖీ చేస్తూ ఉపాధ్యాయులకు ఛార్జీమెమోలు జారీ చేస్తూ, కొందరిని సస్పెండ్ కూడా చేస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులంతా డిఇఒ పేరు చెబితేనే హడలిపోయే పరిస్థితి నెలకొంది. బోధనా సామర్థ్యాల పెంపునకు చర్యలు తీసుకోవాల్సింది పోయి ఉపాధ్యాయుల పట్ల బెదిరింపులకు పాల్పడితే సామర్థ్యాలు మరింత దిగజారే పరిస్థితి నెలకొంటుందని పలువురు హెచ్‌ఎంలు అంటున్నారు. ఎవరికి వారు మెమోలు జారీచేసుకుంటూ వెళ్లిపోతే విద్యాశాఖ పనితీరు మారిపోతుందా? అన్నది చాలా మంది ప్రశ్నిస్తున్నారు. 'పనితీరు మెగురుపడడానికి మెమోలు, సస్పెన్షన్లు వంటివి. కానీ, మెమోలు జారీచేసినంత మాత్రాన పనితీరు మెరుగుపడిపోయినట్టు కాదు సుమా..!' అంటూ చాలా మంది వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఛార్జి మెమోల విషయంలో ప్రవీణ్ ప్రకాష్‌ను అనుకరించడం మానేసి, వ్యవస్థలో లోపాలను సరిచేయడానికి చిత్తశుద్ధి కనబరచాలని ప్రజాదృక్కోణం గలవారు అభిప్రాయపడుతున్నారు. కేవలం జిల్లా విద్యాశాఖ అధికారులే కాకుండా మొత్తం జిల్లాను నడిపించే కలెక్టర్ కూడా చొరవ చూపించాల్సి వుందని పబ్లిక్ టాక్. లేదంటే అటు ప్రభుత్వ ఆశయానికి, ఇటు విద్యార్థుల భవిష్యత్తుకు తూట్లు పొడిచినట్టేనని చర్చించుకుంటున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ వెంకటరమణ, ప్రిన్సిపల్ సంధ్య

తైక్వాండోలో 'గ్లోబల్ వ్యూ' విద్యార్థుల ప్రతిభ

రామభద్రపురం : విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో గ్లోబల్ వ్యూ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఆరుగురు విద్యార్థులు కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ వెంకటరమణ తెలిపారు. పతకాలు సాధించిన జ్యోతిప్రకాష్, కార్తిక్, గుణశేఖర్, రోహిత్, ప్రిన్స్‌బాబు, నవనీతను ఆయనతోపాటు ప్రిన్సిపల్ సంధ్య అభినందించారు. కార్యక్రమంలో కోచ్ సుధాకర్ పాల్గొన్నారు.

సఖి గ్రూపు సమావేశం

వేపాడ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం విద్యార్థినులతో సఖి గ్రూపు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు స్వశక్తితో ఎదగాలని, అందుకు తాము ఇచ్చిన సలహాలను పాటించాలని చెప్పారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ కిలపర్తి అప్పారావు, సఖీ గ్రూప్ సభ్యులు కృష్ణవేణి, లత, ఈశ్వరమ్మ, మహిళా కానిస్టేబుల్ ఎం.వరలక్ష్మి, ఎఎన్ఎం వెంకటలక్ష్మి, హెల్త్‌సూపర్‌వైజర్ డి.సత్యనారాయణ, ఎంఎల్‌ఎం పి.కోమలి పాల్గొన్నారు.

'నారాయణ'లో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

శృంగవరపుకోట : స్థానిక నారాయణ కేంబ్రిడ్జ్ పాఠశాలలో ఇ-కిడ్స్ విభాగంలో శనివారం ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను నిర్వహించారు. దేశ నాయకులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న వ్యక్తుల గురించి, వారు నిర్వర్తించే కర్తవ్యం గురించి పిల్లలకు అర్థమయ్యేటట్లు వివరించినట్లు ప్రిన్సిపల్ సిహెచ్ శేషు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఎజిఎం ఎం.శివరాం, శ్రీనివాసరావు, రీజనల్ ఇన్‌ఛార్జి రవికుమార్, కో-ఆర్డినేటర్ గ్రేసీ, పాఠశాల ఇ-కిడ్స్ వైస్‌ప్రిన్సిపల్ రోజా పాల్గొన్నారు.

అపరాల సాగు పెంచాలి

బొబ్బిలిరూరల్ : అపరాల పంటల సాగు ప్రతి రైతు చేపట్టేలా అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ ఇన్‌ఛార్జ్ ఎడి ఎం.శ్యామసుందర్ తెలిపారు. శనివారం అలజంగి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అపరాల పంటలు, వివిధ రకాల తెగుళ్లు, పురుగులను రైతు ఏ విధంగా గుర్తించగలరనే అంశాలను బ్రైట్ బాక్స్ పద్ధతి అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం మనిషి ఆరోగ్యంపై ఏ విధమైన ప్రభావం చూపిస్తాయని వివరించారు. కార్యక్రమంలో వివిఎ పెంట లత, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

బొబ్బిలి : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పట్టణ ఐసిడిఎస్ సిడిపిఒ విజయకుమారి అన్నారు. అభ్యుదయ, సూర్య పాఠశాలల్లో శనివారం బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసే సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యార్థులు బాలికలు పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్స్ శారద, శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు

వేపాడ : మండల కేంద్రంలో నిర్వహించిన పరదేశమ్మ, ముత్యాలమ్మ జాతర సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి నగదు బహుమతిని సర్పంచ్ ఎం.అర్జునమ్మ అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ ఆర్.ఈశ్వరరావు అభినందించారు.

ఫిబ్రవరి 1న ఐఎఫ్‌టియు జిల్లా మహాసభలు

నెల్లిమర్ల : ఫిబ్రవరి ఒకటిన ఐయఫ్‌టియు జిల్లా మహాసభలు అమరవీరుల భవనంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి రొంగలి అప్పలరాజు తెలిపారు. శనివారం ఐఎఫ్‌టియు ఆధర్యాన సమావేశం జరిగింది. మహాసభకు ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి. ప్రసాద్ ప్రారంభోపన్యాసం చేస్తారని దీంతో బాటు సాయంత్రం 5 గంటలకు నెల్లిమర్ల అమర వీరుల స్మారక సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం. వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో అరుణోదయ నాయకులు అప్పలసూరి, పిఒడబ్ల్యు రాష్ట్ర నాయకులు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయండి

భోగాపురం : స్థానిక బజారు నుండి కొమ్మూరు వీధి వరకు గతంలో వేసిన సిమెంట్ రోడ్డు గతుకుల మయంగా ఉందని, గ్రామస్తులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారని పంచాయతీ స్పందించి వెంటనే ఈ రోడ్డుకు కనీసం మరమత్తులు చేపట్టాలని జనసేన భోగాపురం నాయకులు గ్రామ పంచాయతీ ఇఒ రామకృష్ణ నాయుడుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు పల్లంట్ల జగదీశ్, పల్లా రాంబాబు, మాత నవీన్‌లు మాట్లాడుతూ గ్రామంలో పాడైపోయిన రోడ్డుకు మరమత్తులు చేయాలని పంచాయతీకి వినతి పత్రం అందజేసామని, మార్చి నెలలో జరగబోవు గ్రామ దేవత కనకదుర్గమ్మ జాతరకు ముందే రోడ్డుకు మరమత్తులు చేయించాలని, ఆలా చేయని పక్షంలో గ్రామస్తులుకు, భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు జనసేన తరపున తామె ఈ రోడ్డకు మరమ్మతులు చేస్తామని స్పష్టం చేశారు.

సచివాలయ సందర్శన

పూసపాటిరేగ : మండలంలోని చల్లవానితోట గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ జి. రామారావు తశనివారం సందర్శించారు. పిఎంజివై కార్డులు డౌన్లోడ్ చేసి లబ్దిదారులకు ఇకెవైసి చేయాలని సిబ్బందికి సూచించారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా కొండగుడ్డి, బుర్లివాని కల్లాల్లో ఇంటింటికి కుళాయి ఏర్పాటు పై సంతృప్తి వ్యక్తం చేశారు. చల్లవానితోట ఉత్తమ సచివాలయం అవార్డు దక్కించుకొన్నందుకు సచివాలయ సిబ్బందిని, వాలంటీర్లని అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బాడంగి : జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా వాడాడ హైస్కూల్లో శనివారం జంతు సంక్షేమం- సామాజిక బాధ్యత అనే అంశంపై పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 30 వరకునిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం డాక్టర్ రాధిక విద్యార్థులకు జంతు సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వాడాడ హైస్కూల్ హెచ్‌ఎం బి.విశాలాక్షి పాల్గొన్నారు.

డ్రైవర్లకు శిక్షణ

శృంగవరపుకోట : ఎస్.కోట డిపోలో శనివారం రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా శనివారం డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. సుమారు 30 మంది డ్రైవర్లకు శిక్షణ ఇచ్చినట్లు మేనేజర్ కె.రమేష్ తెలిపారు. డిపో నుంచి పి.గోపాలరావు, సిహెచ్ వెంకటరమణను విజయనగరంలోని ప్రాంతీయ శిక్షణ కార్యాలయానికి పంపించినట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

శృంగవరపుకోట : మండల ప్రజలు రథసప్తమి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు శనివారం ఉదయం నుంచే పట్టణంలోని సూర్యనారాయణ దేవాలయానికి యాత్రికులు పోటెత్తారు. ముందుగా ఆలయ స్థలదాత కుటుంబీకులు గార్లపాటి సత్యసాయి, అనురాధ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు విన్నకోట సూరిబాబు, శంకర్రావు, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని సహకార బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ వి.నాగేశ్వరరావు తెలిపారు. గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) ఆధ్వర్యంలో స్థానిక సత్సంగం ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ, సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి, వి.శ్రీలక్ష్మి, రుణాళి, హృషికేశ్, లాస్య శ్రీ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సభ్యులు కాని వారే వాగ్వివాదం

సర్వసభ్య సమావేశానికి సభ్యులు, పలు శాఖల అధికారులు గైర్హాజరు

ప్రజాశక్తి- రేగిడి

మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి సభ్యులు కాని వారు సమావేశానికి హాజరై పలు శాఖాధికారులతో వాగ్వివాదానికి దిగారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులపై మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలాపల్లి జగన్ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల సర్వసభ్య సమావేశానికి కోరమ్‌కు ఏడుగురు సభ్యులు హాజరు కావలసి ఉండగా వారి స్థానాల్లో వారికి బదులు వారి భర్తలు ఫోర్జరీ చేసి సంతకాలు చేసేసారు. దీంతో పేరుకే మహిళలకు రాజ్యాధికారం తప్పా పురషాధిక్యత కొనసాగుతోందని పలువురు ఆక్షేపిస్తున్నారు. కాగా సమావేశానికి సభ్యులు హాజరకాకపోవడం ఒక ఎత్తైతే సభ్యులు కాని వారు అధికారులపై విరుచుకుపడటంతో అధికారులు కాస్త అసహనానికి లోనైనట్లు తెలిస్తోంది.

ఇఒపిఆర్‌డి నాగభూషణ్ మాట్లాడుతూ 39 గ్రామ పంచాయతీకు గాను 10 పంచాయతీల్లో ఇంత వరకూ చెత్త నుండి సంపాద సృష్టించే కేంద్రాలు ప్రారంభం కాలేదని చెబుతుండగా అప్పాపురం డమ్మీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావు అడ్డు తగిలి కట్టిన వాటికి బిల్లులు ఇవ్వకపోతే మిగతా గ్రామాలు ఎందుకు ముందు కొస్తాయని ప్రశ్నించారు. దీంతో ఇఒపిఆర్‌డి, డమ్మీ సర్పంచ్ శ్రీనివాసరావుకు తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగింది. ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తున్నామని ఎఒ మురళీకృష్ణ సభ దృష్టికి తీసుకొచ్చారు. సచివాలయ పరిధిలో పింఛన్లు ఇచ్చేటప్పుడు ఇంటి పన్ను కట్ చేసుకుని మిగతా డబ్బులు ఇవ్వడం పట్ల సభ్యులు ధ్వజమెత్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియకుండా సరుకులు ఇవ్వడంపై సభ్యులు ప్రశ్నించారు. వైఎస్ఆర్ క్రాంతి పథం, పశు వైద్యం, ఉపాధి హామీ, హౌసింగ్,

సమస్యలపై ప్రశ్నిస్తున్న సభ్యులు

పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలపై చర్చలు తూతూ మంత్రంగానే జరిగాయి. కాగా ఆర్‌టిసి, ఆర్అండ్‌బి, ఫారెస్ట్, ఎక్సైజ్, ఇరిగేషన్, వైద్యం, విద్య శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాధరావు, తహశీల్దార్ టి. కళ్యాణ చక్రవర్తి, హౌసింగ్ ఎఇ అల్లు సూర్య ప్రకాశరావు, ఎపిఒ సంకా బత్తుల హరికృష్ణ, ఎపిఎం మంగమ్మ, మండల జెఇ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే అవినీతి రహిత పాలన

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ముఖ్యమంత్రి జగన్‌తోనే అవినీతి రహిత పాలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ధర్మవరంలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గడపగడపకు.. కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు షేక్ రెహమాన్, పోతనపల్లి వెంకట్రావు, నాయకులు ఎంపిటిసి డి.కనకమహాలక్ష్మి, అల్లు మహాలక్ష్మి నాయుడు (బుజ్జి), అల్లు సుధీర్, లగుడు అవతారం, జి. పైడితల్లి, లగుడు సత్యారావు, శ్రీనివాసరావు, జి.పైడిరాజు, వరికృష్ణ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

లక్కవరపుకోట : మండలంలో కొత్తపాలెంలో దేవాదాయ శాఖ నిధులు రూ.30 లక్షలతో రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. మల్లివీడు పంచాయతీ సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, బోని సన్నీ, వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ, దాసులపాలెం సర్పంచ్ మమ్మన ప్రసాదరావు, స్టీల్ ఎక్స్చేంజ్ పరిశ్రమ హెచ్ఆర్ బాలకృష్ణ, కాంట్రాక్టర్ ఎ.పైడిబాబు, వైస్ సర్పంచ్ ఎ.శ్రీనివాసరావు, పవన్ కుమార్, ఎన్.సత్యం, జామి ఈశ్వరరావు, కసిరెడ్డి కృష్ణ, గేదెల సూరినాయుడు, ఈశ్వరరావు , ఆదిరెడ్డి పెద్దఅర్జున, బోని శేఖర్, తమ్మునాయుడు, అప్పలస్వామి పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో బల్లంకి గ్రామంలో మరిడిమాంబ జాతర సందర్భంగా శనివారం నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో 22 ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. తొలి ఐదు స్థానాల్లో నిలిచిన వాటికి నగదు బహుమతులను సర్పంచ్ బల్లంకి వరలక్ష్మి, ఎంపిటిసి గొంప తులసి , వైస్ సర్పంచ్ పల్లి ధనుంజయ, గ్రామ పెద్దలు బల్లంకి కనకరాజు, మాజీ సర్పంచ్ గొర్లె నాగరాజు, నూకిరెడ్డి తాతమనాయుడు బహుమతులు అందజేశారు.

వైభవంగా జాతర

మండల కేంద్రంలో పరదేశమ్మ, ముత్యాలమ్మ జాతర శనివారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.అర్జునమ్మ, ఎంపిటిసి గాడి గంగతల్లి పాల్గొన్నారు. జాతరలో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించగా, 26 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు నగదు బహుమతులు అందించారు.

ఎడ్ల బండ్ల పోటీలను తిలకిస్తున్న గ్రామస్తులు

మహిళా సాధికారితపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమెన్ ఎంపవర్మెంట్ అనే అంశంపై స్థానిక జెఎన్‌టియు కాలేజీలో శనివారం వర్క్ షాప్ జరిగింది. కార్యక్రమానికి హాజరైన డాకర్ ఎం.మృత్యంజయరావు మాట్లాడుతూ కేన్సర్‌ను ముందుగా గుర్తించగలిగితే ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. ఎక్కువ మందిలో కేన్సర్‌ను చివరి దశలో గుర్తించడంవలన ప్రాణ హాని ఎక్కువగా ఉంటోందన్నారు. కేన్సర్ లోని రకాలు, అవి ఏ రకంగా రావడానికి అవకాశం ఉందో మరియు వాటిని ప్రాథమికంగా ఎలా గుర్తించాలి అనే అంశాలపై వివరించారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారం, పండ్లు, ప్రతీరోజు 3-4లీటర్ల మంచినీరు తీసుకోవాలన్నారు. హెచ్‌పివి అనే వాక్సిన్‌ను వేసుకోవడం ద్వారా భవిషత్తులో కేన్సర్ రాకుండా నివారించవచ్చన్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బి.నళిని మాట్లాడుతూ ప్రతీ మహిళా ఆరోగ్యవంతంగా, శక్తి వంతంగా ఉంటేనే వారి కుటుంబం, సమాజం కూడా బాగుంటుందన్నారు. ప్రతీరంగంలోనూ మహిళలు రాణించాలన్నారు. ప్రతీ మహిళా ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారిత అండ్ గ్రీవెన్సు సెల్ డైరెక్టర్ డాక్టర్ జి.జయసుమ, డాక్టర్ డి రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చెరువు పనులు పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి సన్యాసినాయుడు తదితరులు

కోనేరు అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని కొండ వెలగాడలో జిల్లేడు ముడి చెరువు పనులను జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు శనివారం పరిశీలించారు. పనులు ముమ్మరం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. చెరువు అభివృద్ధి చేయడం ద్వారా తాగునీటి ఇబ్బందులు ఉండవని అన్నారు. గ్రామాభివృద్ధికి పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రంపేట మాజీ సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, ఎంపీటీసీ ప్రతినిధి వాళ్ళే అప్పలనాయుడు, పూతికపేట మాజీ సర్పంచ్ యడ్ల గోవిందరావు, కొడవెలగాడ వై సి పి నాయకులు మొయిద అక్కోజీ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఇఒ జి.శ్రీదేవి సందర్శించారు. అకడమిక్ కేలండర్, ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత సిబ్బంది తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పి కె.రాంప్రసాద్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులతో సమావేశం

మండలంలోని జెడ్‌పి, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఇఒ శ్రీదేవి సమావేశం నిర్వహించారు. పాఠశాలల నిర్వహణపై పలు సూచనలు చేశారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ శ్రీదేవి

సిరిసహస్ర, ప్రదీప్‌ను ఆశీర్వదిస్తున్న మంత్రులు ముత్యాలునాయుడు, అప్పలరాజు

వైభవంగా నిశ్చితార్థ వేడుక

ప్రజాశక్తి-భోగాపురం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరిసహస్ర, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చిన్న కుమారుడు ప్రదీప్‌బాబు నిశ్చితార్థం శుక్రవారం మండలంలోని సన్ రే విలేజ్ రిసార్ట్స్ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సిఎం పి.రాజన్న దొర, మరో డిప్యూటీ సిఎం బూడి ముత్యాలునాయుడు, ఐటిశాఖా మంత్రి గుడివాడ అమర్ నాథ్, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదర అప్పలరాజు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీర భద్ర స్వామి, ఎమ్‌పి బెల్లాన చంద్ర శేఖర్, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. జిల్లాలోని వైసిపి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి సరోజనమ్మ

చదువుకోవడం బాలల హక్కు

జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ

ప్రజాశక్తి-బొబ్బిలి

చదువుకోవడం బాలల హక్కని జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ అన్నారు. ప్రభుత్వ ఐటిఐలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. బాల కార్మికుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలన్నారు. మైనర్లు వాహనాలను నడపవద్దని కోరారు. చెడు అలవాట్లకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాస్కరరావు, ప్యానల్ న్యాయవాది ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

తప్పులను సరి చేసుకోవాలి

తెలిసీ తెలియక చేసిన తప్పులను సరి చేసుకోవాలని జూనియర్ అదనపు జడ్జి సౌమ్య జోసెఫైన్.. ఖైదీలను సూచించారు. సబ్ జైల్లో శనివారం ఖైదీల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖైదీలకు నాణ్యమైన భోజనం పెట్టాలని సబ్‌జైల్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది ప్రసన్నకుమార్, దీపావల్లి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న బేబినాయన

తైక్వాండో పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈ నెల 26న విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో బొబ్బిలి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. కె.జ్ఞానవర్ధన్, ఎం.శ్రీకర్, ఎం.ధర్మతేజ, ఆర్.శ్రుతికీర్తన, ఆర్.సృజన, జి.అనురాధ బంగారు పతకాలు సాధించారు. డి.హర్షిత్, కె.రాగసుధ, బి.నవతేజనాయుడు, ఎ.సూర్యశశాంక్, వంశీకృష్ణ వెండి పతకాలు సాధించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను, కోచ్ సుధాకర్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అభినందించారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలకు 40మంది ఎంపిక

గరివిడిలో ఆదివారం జరిగే జిల్లా స్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి నుంచి 40 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

దగ్ధమైన సామాగ్రిని పరిశీలిస్తున్న నల్లిశ్రీను తదితరులు

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధి జరజాపు పేటలో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పూరిల్లు దగ్ధమై రూ. 2లక్షలు ఆస్థి నష్టం జరిగింది. జరజాపుపేట కొండల వీధిలో కొండల ప్రభావతి పూరింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో టివి, 1తులం బంగారం, 50 తులాల వెండి, ద్విచక్ర వాహనం, నిత్యావసర వస్తువులు, వంట సామాగ్రి కాలిపోయి కట్టు బట్టలతో మిగిలారు. కాగా అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే స్థానికులు, యువకులు అగ్ని మాపక శాఖకు సమాచారం అందించి మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. వార్డు కన్వీనర్ నల్లి శ్రీను, మహిళా పోలీసు శాంభవి పరిశీలించి బాధితులను ప్రమాద తీరును అడిగి తెలుసుకున్నారు. సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గుర్ల : మండలంలోని గుజ్జంగివలసకు చెందిన దేవ సన్యాసిరావు (56) పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గుర్ల పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సన్యాసిరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం పురుగుల మందు తాగినట్లు తెలసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే విజయనగరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోసానికి పాల్పడిన నిందితుడు అరెస్ట్

విజయనగరం : నగరానికి చెందిన పివివి సత్యనారాయణ ఈనెల 19న స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి కలిసి, తనకు అత్యవసరంగా డబ్బులు కావాలని, ఫోన్ పే ద్వారా రూ.10 వేలు వేస్తానని, అందుకు బదులుగా రూ.10వేలు ఇవ్వాలని కోరాడు. సత్యనారాయణ అతని మాటలు నమ్మి, రూ.10వేలు ఇవ్వగా, అతడు ఫోన్ పే చేసినట్లుగా తప్పుడు మెసేజ్ చూపి పరారయ్యాడు. ఈ విషయంపై 1వ పట్టణ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చెయ్యగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అయిన నెల్లిమర్ల కు చెందిన బండారు అప్పల స్వామి అనే వ్యక్తిని శుక్రవారం కోట జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుండి రూ.8వేలు నగదు రికవరీ చేసినట్లు 1వ పట్టణ సిఐ బి.వెంకటరావు తెలిపారు. ఎస్ఐ వి.అశోక్ కుమార్, ఎం.అచ్చిరాజు, కానిస్టేబుళ్లు టి.శ్రీనివాసరావు, పి.శివశంకర్ దర్యాప్తులో సహకరించారు.

మహిళ అదృశ్యం

వంగర : మండలంలోని బాగెంపేటకు చెందిన మరడాన సాయి షర్మిల (21) ఆదృశ్యమైనట్లు కేసు నమోదైందని ఎస్ఐ బి. లోకేశ్వరరావు తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటరమణతో బొబ్బిలి మండలం జగన్నాథపురానికి చెందిన సాయి షర్మిలకు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఈనెల 27 నుంచి సాయి షర్మిల కనిపించకపోవడంతో భర్త వెంకటరమణ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.